క్లుప్తంగా

ముందుగా డబ్బులు చెల్లించకుండా గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలి

జగ్గంపేట/గండేపల్లి/గోకవరం: ప్రభుత్వం అమలు చేస్తున్న దీపం పథకానికి లబ్ధిదారులు ముందుగా డబ్బు చెల్లించేపని లేకుండా ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట, గండేపల్లి, గోకవరంలో దీపం పథకం 2.0ను ఆయన ప్రారంభించారు. మహిళలకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్లకు ముందుగా లబ్ధిదారులు డబ్బులు చెల్లించడాన్ని తాను వ్యతిరేకిస్తున్నాని అన్నారు. ఇదే విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చేసేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ప్రత్తిపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద దీపం 2.0 పథకాన్ని శుక్రవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. మహిళలకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు.

దివ్యాంగులకు అన్నదానం

ఏలేశ్వరం: పట్టణంలోని దివ్యాంగులకు శుక్రవారం దాతలు అన్నదానం చేశారు. ప్రత్తిపాడు మండలం లంపకలోవకు చెందిన సిగిరెడ్డి వీరభద్రరావు, శ్రీకిరణ్మయి కుమార్తె కాశ్విక జన్మదినం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో పిల్లలకు భోజనంతో పాటు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిగిరెడ్డి వరలక్ష్మి, దోసరిత, కావలి శ్రీను, కావలి రక్షిత తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి



వేలంకలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న డీటీ శ్రావణి

కిర్లంపూడి: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జె.చిరంజీవి సూచించారు. మండలంలోని వేలంకలో శుక్రవారం రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి వచ్చిన వినతులను రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రావణి స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంఎల్ఎస్ఓ షేక్ బషీర్, ఆర్ఐ సత్యదేవి తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్, నెట్ బాల్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



విజేతలకు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న నరసింహారావు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు ఉమెన్ నెట్ బాల్, ఉమెన్ బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ శుక్రవారం తెలిపారు. గత నెల 27, 28 తేదీల్లో భీమవరంలో జరిగిన జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ ఉమెన్ బాస్కెట్ బాల్, నెట్ బాల్ పాల్గొని తమ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారన్నారు. ఉమెన్స్ బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రథమ, ఉమెన్స్ నెట్‌బాల్ పోటీల్లో తృతీయ స్థానాల్లో నిలిచారని చెప్పారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను ఆదిత్య వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, తదితరులు అభినందించారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

తుని: రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా 90వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సెప్టెంబర్ 19, 21 తేదీల్లో దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో ఏపీ నుంచి 90 టీములను ఎంపిక చేశారు. అక్టోబర్ 28న విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 90 టీముల నుంచి ఆరు టీంలను ఫైనల్ రౌండ్‌కు ఎంపిక చేశారు. ఫైనల్ రౌండ్‌లో శ్రీప్రకాష్ విద్యార్థులు కుమారి, ఎస్.దేవి, జి.సత్యవిజయ రాష్ట్రస్థాయిలో రెండో స్థానం సాధించి రూ. 1.5 లక్షల నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. శుక్రవారం శ్రీప్రకాష్ విద్యాసంస్థలో అభినందన సభ ఏర్పాటు చేశారు. విజయం సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత నరసింహారావు అభినందించి రూ.5 వేల ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ పాల్గొన్నారు.

7న ఎమ్మార్పీఎస్ జిల్లా సమావేశం

ప్రత్తిపాడు: కాకినాడలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఈ నెల 7న సంఘ జిల్లా స్థాయి సమావేశం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ పెద్దాపురం డివిజన్ అధ్యక్షుడు అద్దాల బాపూజీ శుక్రవారం తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కొండెపూడి శ్యాంబాబు ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

ప్రత్తిపాడు రూరల్: సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణను తక్షణమే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ పెద్దాపురం డివిజన్ అధ్యక్షుడు అద్దాల బాపూజీ డిమాండ్ చేశారు.

హై టెన్షన్ వే

- ధర్మవరంలో జాతీయ రహదారిపై స్కూల్ విద్యార్థుల అవస్థలు
- బిక్కుబిక్కుమంటూ రోడ్డు దాటుతున్న వైనం
- అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరుతున్న తల్లిదండ్రులు



ధర్మవరంలో హైస్కూల్‌కు వెళ్లేందుకు హైవే దాటుతున్న విద్యార్థులు

ప్రత్తిపాడు రూరల్: ఆ గ్రామంలో విద్యార్థులకు చదువు ప్రాణసంకటంగా మారింది. గ్రామానికి, జెడ్పీ హైస్కూల్‌కు మధ్యలో హైవే ఉండటమే దీనికి ప్రధాన కారణం. ప్రస్తుతం పోలీసుల సహకారం లేకుండా విద్యార్థులు హైవే దాటలేని పరిస్థితి నెలకొంది. రోడ్డు దాటే క్రమంలో జరగరానిదేదైనా జరిగితే అయ్యో పాపం అనడం మినహా చేసేది ఏమీ ఉండదు. ఆ పరిస్థితి తలెత్తక ముందే అధికారులు స్పందించి ఒక పరిష్కారం చూపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రత్తిపాడు మండలం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు 16వ నంబర్ జాతీయ రహదారి దాటాల్సి ఉంది. నిత్యం విద్యార్థులకు ఇది పెద్ద సమస్యగా మారింది. ప్రస్తుతం ఈ పాఠశాల విద్యార్థులు జాతీయ రహదారి వద్ద ఉదయం, సాయంత్రం పోలీసుల సహకారంతో రోడ్డు దాటాల్సి వస్తోంది. రహదారిని దాటే మార్గం వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

550 మంది విద్యార్థులు

ధర్మవరంలో జాతీయరహదారికి అవతల వైపు ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ 550 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా ఉదయం, సాయంత్రం హైవేను దాటి వెళ్లాల్సి వస్తోంది. హైవేపై వేగంగా ప్రయాణించే వాహనాలను దాటే క్రమంలో తరచూ విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో ఒక విద్యార్థిని లారీ ఢీకొనడంతో మృతి చెందాడు. దీంతో ప్రత్తిపాడు పోలీసులు హైవే వద్ద ఉదయం, సాయంత్రం విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులను దగ్గరుండి రోడ్డు దాటిస్తున్నారు.

అండర్ పాస్ నిర్మించాలి



విద్యార్థులు స్కూల్‌కు వెళ్లాలంటే తప్పనిసరిగా హైవే దాటాల్సి వస్తుంది. హైవే దాటేటప్పుడు విద్యార్థులు భయంతో నరకం చూస్తున్నాం. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పాఠశాలకు వెళ్లేటప్పుడు ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందో అని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ అండర్ పాస్ నిర్మించాలి.

–మాగాపు శివ, స్థానికుడు, ధర్మవరం

విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి



ధర్మవరంలో పాఠశాల జాతీయ రహదారికి అవతల వైపు ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల సమస్యను నేషనల్ హైవే అథారిటీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఇక్కడ ఫ్లై ఓవర్ బ్రిడ్జి లేదా అండర్ పాస్ నిర్మించి విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి.

–వి.రాజబాబు, ఎంఈఓ, ప్రత్తిపాడు

రత్నగిరిపై కార్తిక మాస సందడి

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో కార్తికమాస సందడి ప్రారంభమైంది. శుక్రవారం రాత్రి ఏడు గంటలకు అనివేటి మండపంలో స్వామివారి ఆలయానికి అభిముఖంగా ఆకాశదీపాన్ని పండితులు వేలాడతీశారు. ఆలయ ప్రధాన అర్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పండితులు ప్రత్యేక పూజలు చేశారు. కాగా శుక్రవారం పది వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

సాంకేతిక లోపంతో నిలిచిన పింఛన్ల పంపిణీ

తుని రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం పింఛన్ల పంపిణీలో తీవ్ర జాప్యం ఏర్పడింది. గ్రామాల్లో ఉదయం ఆరు గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభించినప్పటికీ 9.30 గంటలకు సర్వర్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో యాప్ ఓపెన్ కాకపోవడంతో లబ్ధిదారుల వివరాలు నమోదు సాధ్యం కాలేదు. సిబ్బంది, లబ్ధిదారులు యాప్ ఎప్పుడు పని చేస్తుందా? అని గంటలు తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఎట్టకేలకు మధ్యాహ్నం 2.45 గంటలకు సర్వర్‌లో సాంకేతిక సమస్య పరిష్కారమవ్వడంతో యాప్ పని చేసిందని ఎంపీడీఓ సాయి నవీన్‌కుమార్ తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు 12243 మందికి గాను 11233 మందికి (91.75 శాతం) పింఛన్లు పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. శనివారం వంద శాతం మందికి పింఛన్లు అందజేస్తామని చెప్పారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



తునిలో చదరంగం పోటీలకు హాజరైన విద్యార్థులు

తుని: రోటరీ క్లబ్ రంగం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన చదరంగం పోటీలకు అనూహ్య స్పందన లభించిందని ప్రోగ్రాం కమిటీ చైర్మన్ టి.నాగిరెడ్డి తెలిపారు. శుక్రవారం రెడ్ కాన్వెంట్ వీధిలోని రోటరీ భవనంలో జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన పోటీలకు 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. చదరంగం పోటీలకు బీవీ నాగేశ్వరరావు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. రోటరీక్లబ్ తుని శాఖ అధ్యక్షుడు సీహెచ్.మంగరాజు, కార్యదర్శి ఎస్.వీర్రాజు, కోశాధికారి కిశోర్‌రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ పద్మావతి, కె.కృష్ణబాబు, పొన్నాడ శ్రీనివాస్, చక్కా సుజాత పాల్గొన్నారు.

పేదలకు భూమి పంచాలంటూ ఆందోళన



అడ్డుకొండ భూమిని పేదలకు ఇవ్వాలంటూ ఆందోళన చేస్తున్న రైతు కూలీ సంఘం నేతలు

జగ్గంపేట: గండేపల్లి మండలం కె.గోపాలపురం, జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామాల మధ్య ఉన్న అడ్డుకొండ భూమిని పేదలకు పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజినేయులు డిమాండ్ చేశారు. మల్లిసాల వద్ద అడ్డుకొండ భూమిలో శుక్రవారం రైతు కూలీ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్డుకొండ భూమిని ఆక్రమించి సాగు చేసుకుంటున్న భూస్వాములపై పోరాటాలు చేసి విజయం సాధించామన్నారు. ఇప్పుడు ఈ భూమిని స్థానిక ఎమ్మెల్యే పరిశ్రమలకు కేటాయిస్తామనడం దారుణమంటూ నిరసన వ్యక్తం చేశారు. భూమి కోసం పోరాడిన పేదలకు అన్యాయం చేస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు కూలీసంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు కడితి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: అమావాస్యను పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. 85 మంది భక్తులు రూ.750తో టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొనడంతో మండపం కిక్కిరిసిపోయింది. టికెట్ల ద్వారా దేవస్థానానికి రూ.63,750 ఆదాయం లభించింది. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, కొండ దిగువన తొలిపాంచా వద్ద కనకదుర్గ అమ్మవారికి రుత్విక్కులు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి



ప్రత్తిపాడులో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

ప్రత్తిపాడు: దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని గురువారం ప్రత్తిపాడులో నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ కళామందిర్ వద్ద ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానిగా దేశానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, కాంగ్రెస్ నాయకులు కందిమళ్ల సామ్యేల్, ఏనుగుపల్లి రాంబాబు, ఈరుగుల చక్రం, దాసరి పోలీస్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ప్రత్తిపాడులో ధర్నా చేస్తున్న వలంటీర్లు

ప్రత్తిపాడు: తమను విధుల్లోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో గ్రామ వలంటీర్లు ప్రత్తిపాడు ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద శుక్రవారం రిలే దీక్షలు చేపట్టారు. ఏపీ గ్రామ/వార్డు వలంటీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దీక్షా శిబిరాన్ని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు వలంటీర్లను కొనసాగిస్తామని, అధికారంలోకి రాగానే వారికి రూ.10 వేల వేతనం చెల్లిస్తామంటూ హామీ ఇచ్చిందన్నారు. ఈ హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. వలంటీర్ల సంఘ నాయకులు జాకబ్, దొర, సతీష్‌కుమార్, భవానీ, శ్రీదేవి, అనిత, ప్రశాంతి, వనిత, సత్తిబాబు తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా వల్లభాయ్ పటేల్ జయంతి



ప్రత్తిపాడులో వల్లబాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ప్రత్తిపాడు: దేశ తొలి ఉప ప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని గురువారం ప్రత్తిపాడులో ఘనంగా నిర్వహించారు. భారతీయ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు శింగిలిదేవి సత్తిరాజు పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం 562 సంస్థానాలను భారత్‌లో విలీనం చేసిన ఘనత పటేల్‌దే అన్నారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి మదినే బాబ్జి తదతరులు పాల్గొన్నారు.

ప్రజా హక్కుల ర్యాలీని విజయవంతం చేయాలి

ప్రత్తిపాడు: మత రాజకీయాలు చేస్తున్న ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలనే ప్రధాన డిమాండ్‌తో డిసెంబర్ 4న విజయవాడలో నిర్వహించ తలపెట్టిన ప్రజా హక్కుల ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ లిబరేషన్ కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. మండలంలోని లంపకలోవలో గురువారం నిర్వహించిన ఈ ర్యాలీని లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు ప్రారంభించారు. గ్రామంలోని మెయిన్‌రోడ్డు, ప్రధాన వీధుల గుండా ఈ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.జనార్దన్, జిల్లా కమిటీ సభ్యురాలు రాజాల ఏసురత్నం, లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు బీరా దేవతయ్య, బోడపాటి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ఏలేశ్వరంలో డీఎస్పీని సత్కరిస్తున్న సమితి ప్రతినిధులు

ఏలేశ్వరం: సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచించారు. పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వరా ఫంక్షన్ హాలులో శుక్రవారం స్పార్క్ సంస్థ సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో టెక్నాలజీ దుర్వినియోగం అవుతోందన్నారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పిన విధంగా యువత కలలు కని, వాటిని నిజం చేసుకోవాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసులకు స్పార్క్ సంస్థ సహకరించడం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ సూర్యఅప్పారావు, ఎస్సై రామలింగేశ్వరరావులను సత్కరించారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎస్. విజయబాబు, స్పార్క్ సంస్థ చైర్మన్ సాయిసందీప్, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అమరజీవి



ఏలేశ్వరంలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



గోకవరంలో పొట్టిశ్రీరాములు, గాంధీ విగ్రహాలకు నివాళులు


- ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం
- పొట్టిశ్రీరాములకు ఘన నివాళులు

ఏలేశ్వరం: రాష్ట్ర ఆవతరణ దినోత్సవాన్ని శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన పొట్టిశ్రీరాములు ఆశయాలను మరువరాదన్నారు. పొట్టిశ్రీరాములును నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పైల విజయ్‌కుమార్, వాగుబలరామ్, ఆర్యవైశ్యులు వాగు గున్నబాబు, నానారావు, వెల్లంపల్లి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవం

గోకవరం: ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శుక్రవారం గోకవరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బత్తుల వారి వీధిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపం ఆవరణలో ఉన్న పొట్టి శ్రీరాములు, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాముల ప్రాణత్యాగం ఫలితంగా ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బత్తుల సత్తిబాబు, చోడిశెట్టి గోపీనాథ్‌గుప్తా, బత్తుల వెంకన్నబాబు, పసుమర్తి బుజ్జి, బత్తుల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వీధి నాటకాలు



ధర్మవరంలో మాయలేడి ఘట్టాన్ని వీధి నాటకంగా ప్రదర్శిస్తున్న కళాకారులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో గౌరీశంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్థానిక కళాకారులు గురు, శుక్రవారాల్లో నరకాసుర వధ, మాయ లేడి వీధి నాటకాలను ప్రదర్శించారు. గ్రామంలోని నంది సెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమా హాలు సెంటర్లలో నాటకాన్ని ప్రదర్శించగా స్థానిక, పరిసర గ్రామాల ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు: మండలంలోని ఏలూరు గ్రామ శివారులో సారా స్థావరాలపై శుక్రవారం ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై పి.వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్రీడాకారుల ఎంపికలు

తొండంగి: మండలంలోని రావికంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని రోప్ స్కిప్పింగ్, మల్కంబ్ క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని పాఠశాల హెచ్ఎం బీఆర్‌వీ ప్రసాద్‌రావు శుక్రవారం తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలురు, బాలికలకు రోప్ స్కిప్పింగ్, మల్కంబ్(రెజ్లింగ్ పోల్) క్రీడల్లో ఎంపిక నిర్వహిస్తారని చెప్పారు.

దేదీప్యమానం



వి.కొత్తూరులో దివిటీలు వెలిగించి పూజలు చేస్తున్న ప్రజలు



ఎస్.అన్నవరంలో కుమార్తెతో కలసి దీపావళి జరుపుకుంటున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

- కన్నులపండువగా దీపావళి
- బాణసంచా పేల్చి సందడి చేసిన జనం

ఏలేశ్వరం/తుని రూరల్/ప్రత్తిపాడు/కోటనందూరు/ప్రత్తిపాడు రూరల్/గోకవరం: వెలుగుల పండుగ దీపావళి తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో గురువారం రాత్రి కన్నులపండువగా జరిగింది. ప్రతి ఇంటా వెలుగులు నిండాయి. ప్రజలు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ బాణసంచా కాల్చి సందడి చేశారు. తుని మండలం ఎస్.అన్నవరంలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా తన కుటుంబ సభ్యులతో దీపావళి జరుపుకున్నారు. తేటగుంట శివారు రాజులకొత్తూరులో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు తన కుటుంబ సభ్యులతో కలసి క్రాకర్లను కాల్చి పండగ చేసుకున్నారు. గ్రామాల్లోని పిల్లలు, పెద్దలు సంప్రదాయ దుస్తులు ధరించి దివిటీలు కొట్టి సందడి చేశారు. సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు ఎవరికి వారు తమ స్తోమతకు తగ్గట్టుగా బాణసంచా కాల్చారు. యువకులు ఒకరిపై ఒకరు జువ్వలు వేసుకుంటూ హద్దులు దాటారు. ముందుచూపులో భాగంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పహరా కాశారు.

అనధికారికంగా బాణసంచా విక్రయాలు

దీపావళిని పురస్కరించుకుని గురువారం తొండంగి మండల పరిధిలోని గ్రామాల్లో అనధికారికంగా బాణసంచా విక్రయాలు జరిగాయి. బెండపూడి, ఎ.కొత్తపల్లి తదితర గ్రామాల్లో అనుమతులు లేకుండా బాణసంచా విక్రయించారు. కూటమి నేతల అండదండలతోనే అనధికారికంగా, అధిక ధరలకు విక్రయాలు జరగడంతో అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా భవన కార్మికులు, ఇతర పేద వర్గాల ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో అంతంత మాత్రంగానే దీపావళి వేడుకలు జరుపుకున్నారు.

లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు

ప్రత్తిపాడు రూరల్: దీపావళిని పురస్కరించుకుని గ్రామాలు దీప కాంతులతో కళకళలాడాయి. ప్రజలంతా తమ ఇళ్లల్లో లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో దివిటీలు కొట్టి దీపావళి పండగను జరుపుకున్నారు. ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపారాధనలు చేశారు.



ఒమ్మంగిలో బాణసంచా కాలుస్తున్న చిన్నారులు



గోపాలపట్నం దీపావళి వేడుకల్లో బాణసంచా కాలుస్తున్న బాలలు